## సీఎం కేసీఆర్ చేతుల మీదుగా

# గౌరవెల్లి ప్రాజెక్టును ప్రారంభిస్తాం..

- ఈనెల 25 తర్వాత ఎప్పుడైనా ప్రోగ్రాం
- 50 ఏండ్ల నాటి కల నెరవేరబోతున్నది..
- ఇక మెట్టప్రాంతం సస్యశ్యామలం
- గండిపల్లి ప్రాజెక్టు నిర్మాణం చేపడుతాం
- ప్రాజెక్టును సందర్శించిన అనంతరం సమావేశంలో ఎమ్మెల్యే వొడితెల సతీశ్ కుమార్


అక్కన్నపేట: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీశ్ కుమార్

అక్కన్నపేట, జూన్ 19 : ఈ నెల 25న తర్వాత సీఎం కేసీఆర్ చేతుల మీదుగా గౌరవెల్లి ప్రాజెక్టును ప్రారంభిస్తామని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్ కుమార్ అన్నారు. ఇటీవల సీఎం కేసీఆర్‌ను కలువగా ఆయన సూచన మేరకు సోమవారం ఎమ్మెల్యే వొడితెల సతీశ్ కుమార్ గౌరవెల్లి ప్రాజెక్టును హన్మకొండ జడ్పీచైర్మన్ సుధీర్‌కుమార్, ఏడు మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీలు, మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్, ఏఎంసీ చైర్మన్, ముఖ్య నాయకులు, ప్రాజెక్టు అధికారులతో కలిసి సందర్శించిన అనంతరం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే సతీశ్ కుమార్ మాట్లాడుతూ 50 ఏండ్ల నాటి ఆకాంక్ష నెరవేరబోతున్నదన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు పనులు తుదిదశకు చేరుకున్నాయన్నారు. మిగిలిన పనులను వారం రోజుల్లోగా పూర్తవుతాయన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు ద్వారా లక్ష 6 వేల ఎకరాలకు సాగునీరందుతుందని అన్నారు. గతంలో 1.14 టీఎంసీగా ఉన్న ప్రాజెక్టును సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు సందర్శించి 8.23 టీఎంసీగా డిజైన్ చేశారన్నారు. అయితే 1.14 టీఎంసీగా ఉంటే 24/365 రోజులు మోటర్లు రన్ అయితేనే 1. 06 లక్షల ఎకరాలకు సాగునీరు చేరుతుందన్నారు. ఒక వేళ మోటర్ చెడిపోతే ఒక పంట సీజన్ మొత్తం నీళ్లు అందని పరిస్థితి ఉండేదన్నారు. అప్పటి ఇంజినీర్ల సూచన మేరకు సీఎం కేసీఆర్ దూరదృష్టితో ప్రాజెక్టును రీడిజైన్ చేశారని గుర్తుచేశారు. ప్రాజెక్టు కోసం 3. 870 ఎకరాల భూ సేకరణ చేశామని, భూనిర్వాసితులందరికీ పరిహారం చెల్లింపు చేశామని కొందరు నిర్వాసితులకు సంబంధించి ఎక్కువ పరిహారం కావాలని అడగడంతో కోర్టులో అవార్డు చేయడం జరిగిందన్నారు. మిడ్ మానేరు ద్వారా తోటపల్లి టన్నెల్ ద్వారా రేగొండ పంప్ హౌస్‌కు చేరి అక్కడి నుంచి రోజు 0.7 టీఎంసీ నీళ్లు ప్రాజెక్టుకు చేరుతాయన్నారు. 32 మెగావాట్ల సామర్థ్యం గల మూడు మోటర్లు అమర్చామన్నారు. ప్రాజెక్టు కుడి కాల్వ ద్వారా 90 వేల ఎకరాలకు, ఎడమ కాల్వ ద్వారా 16 వేల ఎకరాలకు సాగునీరందుతుందన్నారు. ప్రాజెక్టు మొత్తం వ్యయం సుమారు రూ. 2600 కోట్లని వివరించారు. కాల్వలకు అదనంగా మరో రూ. 250 కోట్లు మంజూరయ్యాయన్నారు. కాల్వల పనులకు స్థలాలను గుర్తించామన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు నుంచి గండిపల్లి ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. 1.5 టీఎంసీ సామర్థ్యం ఉన్న గండిపల్లి ప్రాజెక్టు ద్వారా అక్కన్నపేట మండలంలోని 14 వేల ఎకరాలకు సాగునీరందుతుందని చెప్పారు. గౌరవెల్లి ప్రాజెక్టుతో మెట్ట ప్రాం తం సస్యశ్యామలంగా మారుతుందన్నారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ భూక్య మంగ, ఎంపీపీ లకావత్ మానస, ఏఎంసీ చైర్మన్ ఎడబోయిన రజనీ తిరుపతిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అయిలేని అనిత, వైస్‌ఎంపీపీ మజ్జిక మొగిలి, ప్రాజెక్టు ఈఈ రాములు నాయక్, డీఈలు, అన్ని మండలాల అధ్యక్షులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు జిల్లా జైలు భవనానికి మంత్రి శంకుస్థాపన


మోడల్ జైలు భవనం

సిద్దిపేట, జూన్ 19 : సిద్దిపేట జిల్లా కేంద్రం కావడంతో సిద్దిపేటలో ప్రభుత్వ కార్యాలయ భవనాలు ఒక్కొక్కటిగా సమకూరుతున్నాయి. రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు సిద్దిపేటలో అధునాతన హంగులు, సౌకర్యాలతో కూడిన నూతన జిల్లా జైలు భవనాన్ని మంజూరు చేయించారు. ఈ భవనాన్ని మంగళవారం సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గ్రామ శివారులో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. రూ.78 కోట్లతో 34 ఎకరాల విస్తీర్ణంలో జిల్లా జైలు భవనాన్ని నిర్మించనున్నారు.

**టూటౌన్ పోలీసుస్టేషన్‌కు కొత్త భవనం**

శాంతిభద్రతల పరిరక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా నూతన పోలీసుస్టేషన్లను ఆధునిక సౌకర్యాలు, హంగులతో నూతన టెక్నాలజీతో నిర్మిస్తుంది. జిల్లా కేంద్రమైన సిద్దిపేట టూటౌన్ పోలీసుస్టేషన్‌కు మంత్రి హరీశ్‌రావు మోడల్ పోలీసుస్టేషన్ భవన నిర్మాణాన్ని మంజూరు చేయించారు. ఈ భవన నిర్మాణానికి నేడు మంత్రి శంకుస్థాపన చేయనున్నారు. రూ.4 కోట్లతో ఈ మోడల్ పోలీసుస్టేషన్ భవనాన్ని నిర్మించనున్నారు.

## యోగా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ


యోగా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

సిద్దిపేట కమాన్, జూన్ 19 : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 21న సిద్దిపేట క్రికెట్ స్టేడియంలో యోగా ఉంటుందని నిర్వాహకులు సోమవారం తెలిపారు. అందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుతున్న జీవన పరిస్థితులు, కాలుష్యం మనుషుల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయని, యోగా ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమన్నారు. ఈ ఉత్సవంలో మంత్రి తన్నీరు హరీశ్‌రావు, వివిధ సంస్థల ప్రతినిధులు, సభ్యులు, అధికారులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో యోగా శిక్షకులు సతీశ్, వ్యాస మహర్షి యోగా సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# హరిత తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం

- సీఎం కృషితో రాష్ట్రం పచ్చబడింది
- సామాజిక బాధ్యతగా మొక్కల సంరక్షణ
- జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి


మద్దూరులో మొక్క నాటి నీళ్లు పోస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

మద్దూరు(ధూళిమిట్ట), జూన్ 19 : హరిత తెలంగాణే లక్ష్యంగా సీఎం కేసీఆర్ రాష్ట్రంలో హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు జనగామ శాసనసభ్యుడు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. సోమవారం మద్దూరు మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మేక సంతోశ్ కుమార్, వైస్‌ఎంపీపీ మలిపెద్ది సుమలతా మల్లేశంతో కలిసి ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా రాష్ట్రంలో మొక్కలు నాటి పెంచుతున్నట్లు కేంద్ర ప్రభుత్వ సంస్థలు ప్రకటించినట్లు తెలిపారు. ఈ పదేండ్ల వ్యవధిలో రాష్ట్రంలో వృక్ష సంపద రెట్టింపు స్థాయిలో పెరిగిందన్నారు. సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ప్రాణవాయువును అందించే మొక్కల పెంపుపై అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేకంగా శ్రద్ధ వహించాలన్నారు. ప్రధానంగా రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ వైర్ల కింద మొక్కలు నాటకూడదన్నారు. మొక్కల సంరక్షణకు మొక్కల చుట్టూ ట్రీగార్డులకు బదులుగా సర్కారి తుమ్మ కంపలను రక్షణగా నాటాలన్నారు. మొక్కలు కాల్చిన, ధ్వంసం చేసిన వారికి పంచాయతీ అధికారులు జరిమానాలను విధించాలన్నారు. గ్రామ పంచాయతీలు ట్యాంకర్ల ద్వారా ప్రతి రోజు మొక్కలకు నీటిని అందించాలన్నారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఈసీ పరశురాములు, సర్పంచ్ కంఠారెడ్డి జనార్దన్‌రెడ్డి, ఎంపీటీసీలు బొప్పె కనకమ్మనాగయ్య, గుజ్జుక సమ్మయ్య, గూళ్ల సత్యకళ ఆనందం, ఉపసర్పంచ్ ఆరీఫ్, పీఏసీఎస్ డైరెక్టర్లు కాటం బాలయ్య, మేక మల్లేశం, కొమురవెల్లి ఆలయ డైరెక్టర్లు కాసర్ల కనకరాజు, చెట్కూరి తిరుపతి, మాజీ ఎంపీటీసీలు సూర్న ఐలయ్య, భూర్గు నర్సింహులు, నాయకులు సిద్ధిఖీ, శెట్టె ఐలయ్య, భూర్గు రాజు తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ అధికారుల తీరుపై ఆగ్రహం

మిరుదొడ్డి, జూన్ 19 : రెవెన్యూ అధికారులు సమయానికి ఆఫీస్‌కు హాజరుకాకుండా తనకు అనుకూలంగా ఉన్న వారికే కులం, ఆదాయం సర్టిఫికెట్లు అందజేస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారుల తీరును నిరసిస్తూ సోమవారం అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో ప్రజలు ఆందోళనకు దిగారు. ప్రభుత్వం కులవృత్తుల వారికి ప్రకటించిన రూ.లక్ష రుణం కోసం ధ్రువీకరణ పత్రాలు తీసుకుందామని ఆయా గ్రామాల ప్రజలు అక్బర్‌పేట-భూంపల్లి తహసీల్ వద్దకు వెళ్లారు. సమయం ఉదయం 11 గంటలైనా అధికారులు ఎవ్వరూ ఆఫీస్‌కు రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ సిద్దిపేట-రామాయంపేట రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న భూంపల్లి పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని వారిని సముదాయించి నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

# పశుగణాభివృద్ధిలో దేశానికే ఆదర్శం


మేలురకం దూడల ప్రదర్శనను ప్రారంభిస్తున్న లక్ష్మారెడ్డి

వర్గల్, జూన్ 19 : రాష్ట్రంలో రోజురోజుకూ పెరుగుతున్న పాల ఉత్పత్తులు, పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలే కారణమని, తెలంగాణ పశుగణాభివృద్ధి యావత్ దేశానికే గర్వకారణమని ఉమ్మడి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గనుప లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం వర్గల్ మండలం అవుసులోనిపల్లిలో గోపాలమిత్ర సం ఘం సభ్యులు భాస్కర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మేలురకం దూడల ప్రదర్శనకు ముఖ్యఅతిథిగా ఆయ న హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ పాల ఉత్పత్తిదారులను ప్రోత్సహించాలనే కృతనిశ్చయంతో ప్రతి లీటర్‌కు రూ.4 అదనంగా పెంచిన్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా విజయడెయిరీ పాడి రైతులకు అందిస్తున్న సేవలు దేశంలో మరెక్కడా లేవన్నారు. మేలురకం లేడ దూడలు పెంచడం ద్వారా ఒక్కోపూటకు 10 లీటర్ల పాల దిగుబడి సాధించొచ్చని తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 150 మంది గోపాలమిత్ర సభ్యులు, 6 సూపర్ వైజర్లు గ్రామీణ స్థాయిలో పని చేస్తున్నారని చెప్పారు. అనంతరం హరిత దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. పశువైద్యురాలు సృజన, వెంకటరాజ్యం, గోపాల మిత్ర సభ్యులు శ్రీరాములు, సురేశ్, రాజు, ఆంజనేయులు పాల్గొన్నారు.

## భార్య మరణానికి కారణమైన భర్తకు జైలు

సిద్దిపేట టౌన్, జూన్ 19 : భార్య మరణానికి కారణమైన భర్తకు సిద్దిపేట న్యాయస్థానం ఏడేండ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ సోమవారం తీర్పు వెలువరించింది. ఈ సందర్భంగా సిద్దిపేట ఏసీపీ దేవారెడ్డి వివరాలను వెల్లడించారు. కోహెడ మండలం శనిగరం గ్రామానికి చెందిన దారం సత్యనారాయణకు అర్చన అనే యువతితో 2016లో వివాహం జరిగింది. సత్యనారాయణ కుటుంబంతో సిద్దిపేట హౌసింగ్ బోర్డు కాలనీలో నివసించేది. పెండ్లి అయిన ఆరు నెలల తర్వాత అర్చనను అదనపు కట్నం తేవాలని వేధించడం మొదలు పెట్టాడు. పెద్దల సమక్షంలో మాట్లాడి రాజీ కుదుర్చారు. కొంత కాలం తర్వాత మళ్లీ అదనపు కట్నం తీసుకురావాలని హింసించాడు. సత్యనారాయణ కొట్టిన దెబ్బలకు తన కూతురు చనిపోయిందని అర్చన తండ్రి నర్సయ్య వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సిద్దిపేట నాటి ఏసీపీ రామేశ్వర్ కేసు పరిశోధన ప్రారంభించి సత్యనారాయణను అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. పరిశోధన పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఇరువురి వాదనలు విన్న జిల్లా న్యాయమూర్తి రఘురాం సత్యనారాయణపై నేరం రుజువు కావడంలో నేరస్తుడికి ఏడేండ్ల కఠిన కారాగార జైలు శిక్షను విధించారు.


నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

SREE VANI HIGH SCHOOL
J.P.Colony, Patancheru : 9246861156, 7396528919
WANTED TEACHERS
VI to X : Telugu, Maths, Physics, Biology, Social
Clerk & PET
Walk-in-interview on 20th June & 22nd June 2023 between 10.00 A.M to 12.30 P.M with original Certificates
Salary: NEGOTIABLE

WANTED
★ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం 16k to 18k ఏజెంట్ కమీషన్ 3k, Ph: 9640258899, 9640468899.
NT-307988-AII

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.